క్లుప్తంగా

అభివృద్ధితో కాలనీ రూపునే మార్చేశాం

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి

రాజానగరం: లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టి, కాలనీ రూపునే మార్చేస్తానంటూ గతంలో తాను ఇచ్చిన హామీని ఆచరించి చూపానని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కాలనీలో రూ.కోటి 20 లక్షల నిధులతో అభివృద్ధి పరచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి అరినా పార్కును ఆదివారం రాత్రి ప్రారంభించారు. భారత రాజ్యాంగ దినోత్సవం రోజున ఆ మహనీయుని పేరిట ఏర్పాటుచేసిన ఈ పార్కును ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గోదావరి జలాలను ఇంటింటికీ తాగునీరుగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నాలుగున్నరేళ్లలో ఈ కాలనీలో రూ.14.70 కోట్ల వ్యయంతో కూడిన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గోకవరం చేరిన అయోధ్య రాముని అక్షింతలు

గోకవరం: స్థానిక దాసరి వారి రామాలయానికి అయోధ్య నుంచి శ్రీరాముని పవిత్ర అక్షింతలు చేరుకున్నాయి. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ నుంచి పంపిన ఈ అక్షింతలను విశ్వ హిందూ పరిషత్ రాజమహేంద్రవరం జిల్లా ప్రచార ప్రముఖ్ ఉంగరాల ఆదివిష్ణు, కొత్తపల్లి సత్యన్నారాయణ కలశంలో పెట్టుకుని ఆదివారం ఆలయానికి తీసుకువచ్చారు. ఈ అక్షింతలకు స్థానికులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదివిష్ణు మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని డిసెంబర్ 8 నుంచి ప్రతి గ్రామానికి ఈ అక్షింతలు, కరపత్రాలు, శ్రీరాముని చిత్రపటం పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో దాసరి ధర్మరాజు, ఇనకోటి బాపన్నదొర, తుమ్మల చిన్నబ్బి, సిద్ధ వాసు, మహిపాల దుర్గారావులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

బిక్కవోలు: మండలంలోని ఇలపల్లి ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించి ఎన్నికల వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఆదివారం పాఠశాల వద్ద భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు రాజకీయ నేతలుగా, ఓటర్లుగా, పోటీచేసే అభ్యర్థులుగా, ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పప్పు శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు ఓటు విలువను తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తమలంపూడి ఈశ్వరరెడ్డి, మానుపూడి సూర్యనారాయణ, సీహెచ్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

హాస్యనటుడు రేలంగి వర్ధంతి

మధురపూడి: హాస్యనటుడు రేలంగి వెంకట్రామయ్య 48వ వర్ధంతి ఆదివారం కోరుకొండ మండలం బూరుగుపూడి రామాలయం వద్ద జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజమహేంద్రవరానికి చెందిన మిర్తిపాటి శేషగిరి రావు మాట్లాడుతూ హాస్యనటనతో వెంకట్రామయ్య ప్రేక్షకులను అలరించారన్నారు. అడపా సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎనీ విశ్లేషకులు అడబాల మరిదయ్య, శేసెట్టి రాము, కట్టా వీరసూరి పాల్గొన్నారు.

బీజేపీ సమావేశం

మధురపూడి: కోరుకొండలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ కోరుకొండ మండల కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాజానగరం నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషిచేయాలన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. మండలాధ్యక్షుడు నీలపాల వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏలూరు జిల్లా ఇన్‌చార్జి ఏపీఆర్ చౌదరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హారిక పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని చినకొండేపూడికి చెందిన గెద్దం వెంకటేష్ (34) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించగా కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ శివకృష్ణ ఆదివారం తెలిపారు. కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడని, అప్పులు అయ్యాయని ఇంటివద్ద మందలించడంతో మనస్తాపం చెందిన వెంకటేష్ ఈ నెల 13న గడ్డి మందు తాగాడన్నారు. తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యసేవలకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు వెంకటేష్ మృతి చెందాడు. మృతుడు వెంకటేష్‌కు ఏడాదిన్నర క్రితం అశ్వనితో వివాహం అయింది. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ శివకృష్ణ తెలిపారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్‌లో తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజకవర్గ కార్యాలయాన్ని ఆదివారం ఆ పార్టీ నాయకుడు యనమల రామకృష్ణుడు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన వన సమారాధన కార్యక్రమంలో నాయకులు నిమ్మకాయల చినరాజప్ప, ప్రత్తిపాటి పుల్లారావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు.

వైభవంగా జ్వాలా తోరణం

కిటకిటలాడిన శివాలయాలు



రాజానగరంలోని శివాలయం వద్ద నిర్వహించిన జ్వాలా తోరణోత్సవం



పందలపాకలో..



అనపర్తి పాతవూరు శివాలయం వద్ద నిర్వహించిన జ్వాలాతోరణం

రాజానగరం: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని నియోజకవర్గంలోని శివాలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ప్రాంగణాలతో పాటు పరిసరాలు కూడా శివనామస్మరణతో మారుమోగాయి. రాజానగరంలోని పురాతన ప్రసిద్ధి చెందిన శ్రీరాజలింగేశ్వరస్వామి, శ్రీరాజగోపాలస్వామి, శ్రీరాజరాజేశ్వరి ఆలయాలలో భక్తులు పోటెత్తారు. ఆలయం ప్రాంగణమంతా దీపారాధనలతో కొత్తశోభతో వెలుగులు పంచింది. సాయంత్రం వేళలో ఆలయం ముంగిట నిర్వహించిన జ్వాలాతోరణోత్సవంలో కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శివపార్వతులు కొలువుతీరి ఉన్న పల్లకీని భుజాన వేసుకుని మోస్తూ మండుతున్న జ్వాలా తోరణం కింది నుంచి 'హరహర మహదేవ శంభోశంకర' అంటూ మూడు పర్యాయాలు అటుఇటు నడిచేందుకు భక్తులు పోటీపడ్డారు. ఇదే సమయంలో అగ్నికి ఆహుతయ్యే తోరణాలను దక్కించుకుంటే పాడిపంటలు వృద్ధి చెందుతాయనే విశ్వాసం ఉన్న భక్తులు వాటి కోసం ఎగబడ్డారు. ఈ ఉత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అనంతరం గ్రామంలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు.

ఉపవాస దీక్షతో...

కార్తిక పౌర్ణమిని మహిళలు ఉపవాస దీక్షతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి ఉపవాస దీక్షలో ఉన్న మహిళలు సాయంత్రం ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాలకు వెళ్లి, దీపారాధనలు చేసి, శివపార్వతులను దర్శించుకున్నారు. అనంతరం స్వగృహాలకు చేరుకుని తులసికోట వద్ద దీపారాధనలు చేసి, పూలు, పండ్లతో తులసి కోటకు పూజలు చేశారు. అద్దంలో చంద్రదర్శనం చేసుకుని, హారతులు పట్టారు. పూర్ణిమ నోములు నోచుకున్నారు. వీరు సాయంత్రం శివాలయాలకు చేరుకోవడంతో రాజానగరం, దివాన్‌చెరువు, కానవరం, తోకాడ, తుంగపాడు, పుణ్యక్షేత్రం, జి.యర్రంపాలెం, సంపత్‌నగరం, నరేంద్రపురం, నందరాడ ప్రాంతాలలోని ఆలయాలు కిటకిటలాడాయి.

కార్తిక దీప కాంతులు.. పున్నమి వెలుగులు

అనపర్తి: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక పాతవూరిలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం, ధరణికోట శివాలయం, స్థానిక మార్కండేయపురంలోని మార్కండేయస్వామి ఆలయం, దుప్పలపూడి చంద్రశేఖర స్వామి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. స్థానిక పాతవూరు ధరణికోట శివాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన దీపోత్సవ కార్యక్రమంలో ఎమ్మెలే దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సబ్బెళ్ల చిన అమ్మిరెడ్డి, కర్రి మిలట్రీరెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, చింతా శ్రీనివాసరెడ్డి, బియ్యం కొట్టు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా..

కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి స్థానిక పాతవూరిలోని ఉమారామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారి పల్లకీ సేవ అనంతరం జ్వాలాతోరణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

వైభవంగా..

బిక్కవోలు: మండలంలోని పందలపాక సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం జ్వాలా తోరణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు కొమాళ్ళపల్లి మల్లేశ్వరశర్మ ఆధ్వర్యంలో ముందుగా స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం జ్వాలా తోరణాన్ని వెలిగించారు. జ్వాలా తోరణం నుంచి గడ్డిని తీసుకునేందుకు రైతులు పోటీపడ్డారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్రారెడ్డి, యాసలపు శ్రీను, వంకా శ్రీను, బొడ్డు ముత్యాలరావు, రెడ్డి సత్తిరాజు, కర్రి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తులసి మొక్కకు పూజ

పెదపూడి: కార్తిక మిగులు పౌర్ణమి సందర్భంగా సంపర కోదండ రామాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో ఆదివారం తులసి మొక్క(మాత)కు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో హాజరైన మహిళలు కుంకుమ, పసుపు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గౌరీశంకర ఆలయంలో ఏకాహం

బిక్కవోలు: మండలంలోని పందలపాక గౌరీశంకర ఆలయం వద్ద ఆదివారం కార్తిక మాసం పౌర్ణమిని పురస్కరించుకుని ఏకాహం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీశంకర బాల భక్త భజన మండలి ఆధ్వర్యంలో భజనలు చేశారు. అర్చకులు విశేష పూజలు జరిపారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో తుమ్మూరి వెంకటరమణ, గొర్రిపోటి సత్యనారాయణ, రెడ్డి శ్రీను, అడపా సత్తిరాజు, పంపన ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్షపత్రి పూజ

రంగంపేట: మండలంలోని చంద్రేడులో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో ఆదివారం లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి 11 రకాల ద్రవ్యాలతో చంద్రశేఖరస్వామికి అభిషేకాలు, పత్రి పూజ, కాత్యాయనీదేవి అమ్మవారికి కుంకుమార్చన, నీరాజన మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి పూజలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

అవగాహన లేక నిందలు

టీడీపీ ఇన్‌చార్జి వెంకటరమణచౌదరి ఆరోపణలకు వైఎస్సార్ సీపీ నాయకుల ఖండన



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

సీతానగరం: తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి మిడిమిడి జ్ఞానంతో నిందారోపణలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నేతలు విమర్శించారు. సీతానగరంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లమళ్ళ వెంకటలక్ష్మి, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి మద్దాల కొండలరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకె చైర్మన్ వలవల వెంకట్రాజు పాల్గొన్నారు. మండల అభివృద్ధికి టీడీపీ ఏనాడైనా కట్టుబడి పని చేసిందా, ప్రజా సమస్యల కోసం ఏనాడైనా పోరాడిందా అని ప్రశ్నించారు. మండల ప్రజల చిరకాల స్వప్నమైన నాలుగు లైన్ల రోడ్డు పనుల కోసం రూ.105 కోట్లు కేటాయించి పనులు చేపడుతున్నామన్నారు. రోడ్డు నాణ్యత విషయమై వెంకట రమణ చౌదరి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న పెందుర్తి వెంకటేష్ స్థానంలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా భాధ్యతలు చేపట్టిన ఆయన ఇక్కడ పరిస్థితులపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. గోదావరి పుష్కరాల సమయంలో వేసిన రోడ్డు నెల రోజులకే పాడయి అచ్చులుగా పైకి లేచిపోయిన విషయం మీ దృష్టికి రాలేదా అని ఎద్దేవా చేశారు. యాక్సిడెంట్‌లో మరణించడం చాలా బాధాకరం అన్నారు. టీడీపీ హయాంలో ఐదేళ్లలో 30 మందికి పైగా చనిపోయారని, ఆ సమయంలో టీడీపీ అధికారంలో ఉండి ఏం చేసిందని నిలదీశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో 20 వేల ఇళ్ల స్థలాల పట్టాలు అందించామని గుర్తు చేశారు. సీతానగరం, కోరుకొండ మండలాల్లో 20 వేల ఎకరాలు ముంపు నివారణ కోసం రూ 91.10 కోట్లు మంజూరు, నియోజకవర్గ పరిధిలో మైనర్ ఇరిగేషన్, అభివృద్ధి పనులకు రూ.38 కోట్లు కేటాయించిన ఘనత ఎమ్మెల్యే జక్కంపూడికి దక్కుతుందని, ఈనెల 29న ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తారని వివరించారు. రఘుదేవపురంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారన్నారు. అభివృద్ధిని అడ్డుకోవడమే టీడీపీ అజెండా మారిందని ధ్వజమెత్తారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



దుప్పలపూడిలో అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



కాండ్రేగులలో జ్యోతిరావుపూలే, సావిత్రీబాయిపూలేల విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- దుప్పలపూడిలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

అనపర్తి: ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దుప్పలపూడిలో రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.7.20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామంలోని ఊర చెరువు నుంచి శ్మశానవాటిక వరకూ నిర్మించిన సీసీ రోడ్డు, కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించిన ఐదు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యం విషయంలో ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని చెప్పారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ సర్పంచ్ వల్లభశెట్టి శివపద్మిని, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొండా ప్రేమలత, మాజీ ఎంపీటీసీ చిత్సారపు బాపిరాజు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వల్లభశెట్టి రామసతీష్, విద్యా కమిటీ చైర్మన్ గుంటూరు అంబేడ్కర్, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీదేవి, మండ సత్యనారాయణ, వాడ్రేవు చంద్రశేఖర్, ఓగిరెడ్డి శ్రీను, కోట ఏసు పాల్గొన్నారు.

కాండ్రేగులలో విగ్రహాల ఆవిష్కరణ

పెదపూడి: మహాత్మా జ్యోతిరావు పూలే, ఆయన భార్య సావిత్రీబాయిపూలేలు కులవ్యవస్థ నిర్మూలనకు, మహిళల అక్షరాస్యతకు కృషి చేసిన సంఘ సంస్కర్తలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం కాండ్రేగులలో జ్యోతిరావుపూలే, సావిత్రీబాయిపూలేల విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర భూదాన యజ్ఞ బోర్డు చైర్మన్ తాడి విజయభాస్కర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ, ఉప సర్పంచ్ సాంబత్తుల సూర్యనాగమణి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కట్టా విజయరాజు, తాళ్లూరు శ్రీను, మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, జిల్లా కార్యదర్శి వాసంశెట్టి మాధవ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల రామస్వామి

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెంలో అగ్నిప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు చేయూతనందించారు. స్థానిక శాగో ఫ్యాక్టరీకి వెళ్లే మార్గంలో కండేపల్లి వెంకటేశ్వరరావుకు చెందిన తాటాకు ఇంటి నుంచి ఆదివారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు, స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. రంపచోడవరం నుంచి వచ్చిన ఫైర్ ఇంజిన్ మంటలను అదుపు చేసింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు జ్యోతుల రామస్వామి, స్థానిక నాయకులతో కలిసి బాధితులను పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బాధితులకు రూ.10 వేల నగదు, బియ్యం బస్తా, కూరగాయలు, వంట సామగ్రి, దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సుంకర వీరబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, రౌతు జోగేశ్వరరావు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్ కుమార్, అంబటి ప్రసన్న, బిజ్జి రాజు, మచ్చా మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వన సమారాధన

పెదపూడి: జి.మామిడాడలోని ఫ్యామిలీ హెల్త్ క్లబ్‌లో ఆదివారం కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులతో పాటు రాష్ట్ర భూదాన యజ్ఞబోర్డు చైర్మన్ తాడి విజయభాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉసిరిచెట్టు వద్ద గణపతి పూజ, కార్తిక దామోదర పూజలు చేశారు. ఇనకోటి నారాయణమూర్తి జీఆర్ఏసీఏ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ట్రస్ట్ ఫౌండర్ లక్ష్మి, ఇస్రో ప్రాజెక్టు డైరెక్టర్ కర్రి దినేష్‌రెడ్డి, పీజీ పరీక్షల్లో సైకియాట్రీ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన డాక్టర్ సబ్బెళ్ల చందన తదితరులను ఎమ్మెల్యే దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ చింతా అనురాధ, ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ లంక మున్ని, క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని చినవంగలపూడి శ్రీగౌరీదేవి అమ్మవారి సంబరం ముగింపు సందర్భంగా ఆదివారం కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. శ్రీగౌరీదేవి అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వంగలపూడి మామిడి తోటలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఎంపీపీ జి.జ్యోత్స్న, జెడ్పీటీసీ సభ్యురాలు సీహెచ్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- కానవరంలో కొనసాగుతున్న గడప గడపకూ మన ప్రభుత్వం



కానవరంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజా

రాజానగరం: రాష్ట్రాభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని కానవరంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, ప్రజల యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పరంగా అమలు చేసన వివిధ సంక్షేమ పథకాలు ఏ మేరకు ఆయా కుటుంబాలకు అందాయో గణాంకాలతో సహా లబ్ధిదారులకు వివరించారు.

రూ.16,31,50,444 లబ్ధి

సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలో 4,495 మందికి రూ.16,31,50,444ల ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. ఏ విధమైన సమస్యలున్నా నిర్భయంగా తెలియజేసి, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల సభ్యులు ప్రజలను ఏవిధంగా పీడించేవారో గుర్తు చేస్తూ, అటువంటి వారిని ఎప్పటికీ దూరంగానే ఉంచాలన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను తెలియజేశారు. సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా సకాలంలో అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని మరచిపోయే ప్రభుత్వం తమది కాదని, నాడు ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం నెరవేర్చిన ప్రభుత్వం తమదని సగర్వంగా చెప్పగలమన్నారు. ఈ సందర్భంగా సీలింగ్ భూములకు సంబంధించిన పాస్ బుక్కులను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్ల గురించి విన్నపాలు వచ్చాయి. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంటేనే ప్రజలదని, దానికి ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉండాలన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే రాజా కోరారు. వైస్ ఎంపీపీ కోడి రాఘవ, వైఎస్సార్ సీపీ మండల కోకన్వీనర్ గండి నానిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి శ్రీరామకృష్ణ, నాయకులు అనదాస సాయిరామ్, ఎస్.వీరవెంకట్రావు, ఎస్. వెంకటేశ్వరరావు, ప్రగడ ఛక్రీ, బాసిబాబు, సత్తిబాబు, సత్యంబాబు, ఎస్.శ్రీనివాసరావు, ప్రసాద్, అడబాల సత్యనారాయణ, పెదిరెడ్డి శ్రీను, చొల్లంగి శ్రీను పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



'నన్నయ'లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

అనపర్తి: ప్రజలందరూ తమ హక్కుల కోసం రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దుప్పలపూడిలో ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, వల్లభశెట్టి రామసతీష్, ఎంపీటీసీ కొండా ప్రేమలత పాల్గొన్నారు.

పెదపూడి: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అడుగుజాడల్లో అందరూ నడవాలని తహసీల్దార్ టి.సుబాష్ అన్నారు. రామేశ్వరంలో సర్పంచ్ కొటికలపూడి చినబాబు అధ్యక్షతన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వీవీసాయిబాబు అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

బిక్కవోలు: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని కొంకుదురు శాఖా గ్రంథాలయం వద్ద విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోకవరం: స్థానిక ఠాణా సెంటర్, అరవపేటలోని అంబేడ్కర్ విగ్రహాలకు ఎస్సీసెల్ మండల కన్వీనర్ బిజ్జి రాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సుంకర వీరబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి పాల్గొన్నారు.

రాజానగరం: ప్రపంచ దేశాలకు భారత దేశ గొప్పతనాన్ని, విశిష్టతను తెలియజేసే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయులు ఎల్లప్పుడు చిరస్మరణీయులేనని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదివారం 74వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, గ్రంథాలయ సమన్వయకర్త డాక్టర్ పి.విజయనిర్మల, సహాయ గ్రంథాలయాధికారి డాక్టర్ టి. సింహాచలం పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో రాజ్యాంగ దినోత్సవం స్టాఫ్ సెక్రటరీ కె.సతీష్‌బాబు అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులు ఎం.వీరభద్రరావు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ఎంపీపీ స్కూల్ -2 లో హెచ్‌ఎం బి.భాస్కరరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

మధురపూడి: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గుమ్ములూరు, బూరుగుపూడి, దోసకాయలపల్లిల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, సర్పంచ్ సింధూదివ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవం

రాజానగరం: మండలంలోని వెలుగుబంద, రాధేయపాలెంలలో రూ.7.64 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోమవారం ప్రారంభించనున్నారు. రూ. 5 కోట్ల వ్యయంతో వెలుగుబందలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ని ఉదయం 11 గంటలకు, రూ.2.64 కోట్లతో రాధేయపాలెంలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ని మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభిస్తారు. అనంతరం చక్రద్వారబంధంలో జరిగే గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు.

29న మోటార్ సైకిళ్ల వేలం

మధురపూడి: కోరుకొండ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లోని ఐదు ద్విచక్ర వాహనాలకు ఈ నెల 29వ తేదీన బహిరంగ వేలం పాటను నిర్వహించనున్నట్టు సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. పాల్గొనదల్చినవారు రూ.2,000 ప్రవేశ రుసుము చెల్లించాలన్నారు. పాట అనంతరం ఈ నగదు తిరిగి చెల్లిస్తామన్నారు.